క్లుప్తంగా

17న భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం



భువనేశ్వరీ దేవి

దాబాగార్డెన్స్: భువనేశ్వరీ దేవి ఆరాధన పీఠం, ఓం భువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సబ్బవరం మండలం యాతపాలెం గ్రామం చెల్లాయ్యమ్మతోటలో వేంచేసిన భువనేశ్వరీ దేవికి ఈ నెల 17న సంపంగి పత్రితో అధివాస మహోత్సవం నిర్వహించనున్నట్టు ట్రస్ట్ నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. ఆ రోజు ఉదయం యథావిధిగా అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, దివ్య పంచామృతాలతో మంగళస్నానం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

కుటుంబం చెంతకు వివాహిత



వివాహితను భర్త, తండ్రికి అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

అల్లిపురం: భర్త, అత్త వేధింపులు తట్టుకోలేక ఇంటి నుంచి బయటికి వచ్చిన కాకినాడకు చెందిన వివాహిత వానపల్లి జ్యోతిశ్రీకి ఈ నెల 13వ తేదీన మహారాణిపేట పోలీసులు ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఆమె భర్త, తండ్రిని పిలిపించిన ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం భర్త వానపల్లి లీలా మోహన్, తండ్రి ఇమంది తమ్మయ్యలకు జ్యోతిశ్రీని గురువారం అప్పగించారు. జ్యోతిశ్రీ కొన్ని రోజులు తండ్రి దగ్గర ఉంటానని చెప్పడంతో, వారితో పూచీకత్తు లేఖ రాయించుకుని జ్యోతిశ్రీని పంపించినట్లు వాసు తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

అల్లిపురం: ఈ ఏడాది జనవరిలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కేజీన్నర గంజాయితో ముగ్గురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న అల్లిపురానికి చెందిన బొండా తరుణ్‌ను బుధవారం రాత్రి అదుపులోకి తీసుకుని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు తెలిపారు.

కప్పరాడ కూడలిలో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటుకు వినతి



సీపీ శంఖబ్రత బాగ్చీకి సమస్యలు వివరిస్తున్న స్థానికులు

కంచరపాలెం: జీవీఎంసీ 47,48 వార్డుల పరిధి కంచరపాలెం జాతీయ రహదారి కూడలిలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. కప్పరాడ మండల అధ్యక్షుడు గుణపూడి అరుణబాబు నేతృత్వంలో గురువారం కంచరపాలెం పర్యటనలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీకి వినతిపత్రం అందజేశారు. కంచరపాలెం జాతీయ రహదారి కప్పరాడ కూడలిలో సాయంత్రం వేళల్లో రాకపోకలు సాగించే మహిళల పట్ల గంజాయి బ్యాచ్, మద్యం సేవించిన ఆకతాయిలు ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. నివాస ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. సమస్యలను, సంఘ వ్యతిరేక కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని పోలీస్ బీట్ ఏర్పాటు చేసి, నైట్ రౌండ్లు పెంచాలని కోరారు. సమస్యలపై సానుకులంగా స్పందించిన పోలీస్ కమిషనర్ త్వరలో ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ లీడర్ ఎస్.జైకుమార్, రాంజీ ఎస్టేట్ గ్రామ అధ్యక్షుడు వరప్రసాద్, గణేష్, పైడివాడ శ్రీనివాస్, బాపూజీ నగర్ గ్రామాధ్యక్షుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టురోగులకు రేషన్, దుస్తుల పంపిణీ



రేషన్, దుప్పట్లు, చీరలు అందుకున్న కుష్టురోగులు

తాటిచెట్లపాలెం: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సీతమ్మధారలో గల ఏఎంజీ సంస్థ ఆధ్వర్యంలో కుష్టురోగుల కుటుంబాలకు గురువారం సీతమ్మధారలో గల సంస్థ కార్యాలయంలో దుప్పట్లు, చీరలు, రేషన్ పంపిణీ చేశారు.

నిర్వీర్యం



ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయం (నాడు)



ప్రసాద్‌గార్డెన్స్ సచివాయం బోర్డు కూడా తీసేసిన వైనం (నేడు)

- మసకబారుతున్న సచివాలయాల సేవలు
- కూటమి ప్రభుత్వ నిర్వాకమని మండిపడుతున్న ప్రజలు
- గత ప్రభుత్వ హయాంలో సచివాలయాల నిర్వహణ తీరును గుర్తు చేసుకుని ఆవేదన వ్యక్తీకరణ



ఉడ్‌యార్డ్ వీధి సచివాలయం

జగదాంబ: ప్రతి ఏటై ఇళ్లకు వెళ్లి వారికి సంక్షేమం అందించేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వలంటీర్లు ఎంతగానో శ్రమించేవారు. ఏ చిన్న పని కావాలన్నా వలంటీర్లు రావాలని లబ్ధిదారులు అనుకునేంతగా వారు మమేకమైపోయారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి వారిని తొలగించి ప్రజల ఆశలపై నీళ్లు జల్లింది.

అంతంతమాత్రం సేవలతో సరి..

జగనన్న ప్రభుత్వ హయాంలో నిత్యం లబ్ధిదారులతో కిటకిటలాడిన సచివాలయాలు ఇప్పుడు బోసిపోయి కనిపిస్తున్నాయి. నాడు ఏ పని కావాలన్నా లబ్ధిదారులు తమ సమీపంలోని సచివాలయానికి వెళ్లి చేయించుకునేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. అనేక సేవలు ఇప్పుడు అందడం లేదంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సచివాలయ ఉద్యోగుల బదిలీల వల్ల కూడా పలు సేవలకు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. బదిలీలు జరిగి నెలరోజులు కావస్తున్నా పలు సచివాలయాల అడ్మిన్లకు లాగిన్ (కీ) ఇవ్వకపోవడం వల్ల తమ పనులు కావడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. జోనల్ స్థాయి అధికారులు కూడా కేవలం సమావేశాలు నిర్వహించడం, ట్యాక్స్‌ల వసూలు, సర్వేల నిర్వహణ, పింఛన్ల పంపిణీ వంటి పనులకు సెక్రటరీలను ఉపయోగించుకుంటున్నారు కానీ ప్రజలకు నిజంగా అవసరమయ్యే సేవలు వారితో చేయించడంలేదు.

సర్వేలతో సరి..

జీవీఎంసీ 35వ వార్డులో ప్రసాద్‌గార్డెన్స్, పండా వీధి సచివాలయాల పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆ ప్రాంతీయలు ఆరోపిస్తున్నారు. చాలా వరకు సేవలు అందకపోవడంతో పాటు నిరంతరం సర్వేల వల్ల సెక్రటరీలు అందుబాటులో ఉండటం లేదని చెబుతున్నారు. దీనివల్ల అవసరమైన సర్టిఫికెట్లు సమయానికి పొందలేకపోతున్నామని లబ్ధిదారులు ఫిర్యాదు చేస్తున్నారు.

> **ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుతున్నాం..**
>
> గత ప్రభుత్వ హయాంలో ఏ చిన్న పని అయినా ఇంటికి వచ్చి చేసేవారు. ఇప్పుడు ఏ చిన్న పనికి అయినా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. అయితే సచివాలయాల్లో ప్రింటర్ సదుపాయం లేక ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలేదు. వాట్సాప్‌కు పంపి ప్రింట్ తీయించుకోమంటున్నారు.
>
> – పోలవరపు రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

> **పథకాలు లేవు.. సెక్రటరీలు కనిపించడంలేదు..**
>
> గతంలో సచివాలయం అంటే ఇంటి ముందరే ఉండేది. పథకాల పేరుతో వలంటీర్లు, సెక్రటరీలు వీధుల్లో తిరుగుతూ ఉండేవారు. ఇప్పుడు పథకాల్లేవు.. సెక్రటరీలు కనిపించడం లేదు. ఏవో సర్వేలంట వాటి కోసమే సెక్రటరీలు వచ్చి ఏవేవో ప్రశ్నలు వేసి వెళ్తున్నారు.
>
> – నాయిని కనకమ్మ, పండావీధి, జీవీఎంసీ 35వ వార్డు

గౌతు లచ్చన్న జయంతి అధికారికంగా నిర్వహించాలి



తోట వాసుదేవరావు

దాబాగార్డెన్స్: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని శ్రీశయన సంక్షేమ సేవా సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తన కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 16న సర్దార్ గౌతులచ్చన్న 116వ జయంతి ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆ రోజు నగరంలోని జిల్లా కోర్టు సమీపాన ఉన్న లచ్చన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తామన్నారు. పలాస కేంద్రంగా కొత్తగా ఏర్పాటు కాబోతున్న జిల్లాకు గౌతు లచ్చన్న జిల్లాగా నామకరణం చేయాలని కోరారు. గౌతు లచ్చన్న స్వాతంత్య్ర సమరం, రాష్ట్రానికి చేసిన సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం షీలానగర్ నుంచి అనకాపల్లి వెళ్లే జాతీయ రహదారిలో లచ్చన్న స్మృతి వనం, మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. లచ్చన్న జీవిత విశేషాలు భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాసుదేవరావు పేర్కొన్నారు.

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో అదానీ చేతికి విద్యుత్ సంస్థ



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ముఠా కళాసీలు

అల్లిపురం: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా టీఎస్ఆర్ కాంప్లెక్స్ వద్ద ముఠా కళాసీలు గురువారం ఎం. సుబ్బారావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టడం అంటే విద్యుత్ సంస్థను అదానీ చేతిలో పెట్టడమేనన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టిన వెంటనే మన విద్యుత్ ఖాతా అదానీ గ్రూపులో పడుతుందన్నారు. ఒకపక్క కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి ట్రూ అప్ చార్జీలు, ఇంధన సర్ చార్జీలంటూ రకరకాల పేర్లతో మన నెత్తిన గుదిబండ వేస్తుందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సాక్షాత్తు లోకేషే స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి అని పిలుపునిచ్చారన్నారు. మరి ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముఠా కళాసీలు పాల్గొన్నారు.

వలంటీర్లకు అన్యాయం చేసిన కూటమి ప్రభుత్వం



31వ వార్డులో వలంటీర్లు, స్థానికులతో మాట్లాడుతున్న బాపూ ఆనంద్ తదితరులు



వెలంపేటలో ప్రచారం చేస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు

దాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి వలంటీర్లకు అన్యాయం చేసిందని వైఎస్సార్‌సీపీ 31వ వార్డు అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ విమర్శించారు. వార్డు పరిధి 202 పోలింగ్ బూత్ పరిధిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో తిరుగుతూ వలంటీర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానంలో వలంటీర్లకు రూ. 5 వేలు కాదు రూ.10 వేలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక వారిని నిరుద్యోగులుగా మార్చిందని దుయ్యబట్టారు. వలంటీర్లకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కరించే వారు కరువయ్యారని, కష్టం వస్తే గతంలో వాసుపల్లి గణేష్‌కుమార్‌కి చెప్పే వారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని స్థానికులు బాపూ ఆనంద్ వద్ద వాపోయారు. ఏ కష్టం వచ్చినా తనకు తెలిపితే వాసుపల్లి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెంటకోట నాగరాజు, రాము మాస్టారు, పిలక మోహన్, కాండ్రేగుల నాయుడు, కనుకులు, త్రినాథ్, అప్పారావు, శంకర్రావు, దినేష్, వెంకటేష్, శ్రీనివాస్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. 84వ బూత్ పరిధి వెలంపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రబాబు మోసపూరిత హామీల గురించి ప్రజలకు వివరించారు. ఇటువంటి ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని సంక్షేమ పథకాలు పొందాలని కనకరెడ్డి వివరించారు. ఈక్యాక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు, సౌత్ గ్రీవెన్స్ సెల్ ప్రెసిడెంట్ మల్ల బుజ్జి, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, నాగిరెడ్డి, కనకమ్మ, పి.రమణమ్మ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

దాబాగార్డెన్స్: ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామంటూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం గురువారం దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపింది. కార్యక్రమంలో పాల్గొన్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మద్దెల సుబ్బన్న మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన సంస్కృతి, మత సామరస్యం, మన సాంప్రదాయమని, భారతదేశంలో ఎన్నో సంస్కృతులు, సాంప్రదాయాలు మరెన్నో కులాలు, మతాలు, భాషలు ఉన్నా, 75 ఏళ్లుగా మనల్ని ఐక్యంగా ఉంచి నడిపించింది మన రాజ్యాంగమన్నారు. మతోన్మాదులు ఆర్ఎస్ఎస్ రూపంలో భారత రాజ్యాంగాన్ని చిన్నాభిన్నం చేసే ప్రమాదం పొంచి ఉందన్నారు. ప్రజలందరూ సమానంగా, ఐక్యంగా ఉండడం ఇష్టం లేక, రాజ్యాంగ పీఠికల నుంచి సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని చూస్తుందన్నారు. సిటు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ బీజేపీ విద్యను కాషాయీకరణ గావించిందని, చరిత్రను వక్రీకరించి స్వాతంత్య్ర పోరాటంలో వెన్ను చూపిన వారిని దేశభక్తులుగా చిత్రీకరిస్తుందని, రాజ్యాంగ వ్యవస్థలన్నిటిలోనూ ఆర్ఎస్ఎస్ వారితో నింపి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందన్నారు. కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడితే ముందుగా నష్టపోయేది దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు, మైనార్టీలేనని, కాబట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వైటీ దాస్, కేవీపీఎస్ నాయకుడు వై.రాజు, సోమాదుల గణేష్, పార్థసారథి, ఇమాన్యుయేల్, సరోజినమ్మ, చంద్రశేఖర్, ఈశ్వరరావు, ఐసీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి శ్రావణం పూజలు



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు గురువారం 21వ రోజుకు చేరాయి. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. కార్యక్రమంలో ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు నాలుగో శుక్రవారం శ్రావణ పూజలు..

శ్రావణమాసం నాలుగో శుక్రవారం పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

రజత వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనం నేడు..

శ్రావణ మాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారు రజత వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు జరపనున్నారు. మహిళలచే సామూహిక లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

వచ్చే నెల 20న డిజైన్ కనెక్ట్-2025 మెగా ఈవెంట్



మెగా ఈవెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 20న 'డిజైన్ కనెక్ట్ 2025' పేరిట మెగా ఈవెంట్ నిర్వహించనున్నట్టు ఐఎస్ఎస్‌డీ మేనేజింగ్ డైరెక్టర్ హేమసుందర్, నిర్మాణ్ ఆర్కిటెక్ట్ అధినేత బండారు సురేష్‌కుమార్, ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకుడు వీరుమామ తెలిపారు. ఈ మేరకు మెగా ఈవెంట్ పోస్టర్‌ను గురువారం ద్వారకానగర్‌లో ఉన్న ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిజైన్ కనెక్ట్ పేరిట నిర్వహించనున్న ఈవెంట్ థీమ్ 'ఈకో'అని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సృజనాత్మక మేధావులంతా పాల్గొంటున్నట్టు వెల్లడించారు. ముఖ్యంగా కోల్‌కతా, ముంబాయి నగరాల నుంచి ప్రముఖ మోడల్స్ రానున్నట్టు చెప్పారు. సృజనాత్మక దుస్తుల కలెక్షన్లు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా యువ డిజైనర్లను ప్రోత్సహించడమే కాక ఆంధ్ర ప్రాంతపు హస్తకళలు, వస్త్ర పరంపరను ప్రపంచానికి పరిచయం చేయడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. పోర్టు స్టేడియం వేదికగా ఆ రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ మెగా ఈవెంట్ జరగనుందని చెప్పారు. కోవిడ్ తర్వాత దేశంలోనే పెద్ద ఈవెంట్ కాబోతుందని వెల్లడించారు. అబ్రాడ్ దేశాల్లో జరిగే ఈవెంట్ తరహాలో ఈ మెగా ఈవెంట్ ఉండబోతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ డిజైన్ డైరెక్టర్ అమ్రిత, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ



హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సహకారంతో నిర్వహించనున్న అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ (ఏక్యూవీహెచ్) 2025లో భాగంగా నిర్వహించే విశ్వవిద్యాలయ స్థాయి పోటీల పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్‌ను సెప్టెంబర్ 13న నిర్వహించనుంది. ఇందుకు సన్నాహకంగా విశ్వవిద్యాలయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఏయూ పరిధిలోని కళాశాల విద్యార్థులకు ఆగస్టు 28న హ్యాకథాన్ నిర్వహిస్తారు. విశ్వవిద్యాలయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హ్యాకథాన్ కన్వీనర్ ఆచార్య డి.లలిత భాస్కరి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి రగిలించేలా హర్ ఘర్ తిరంగా



కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థినులకు జెండాలు అందజేస్తున్న ఇగ్నో డైరెక్టర్ ధర్మారావు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం తరఫున నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. ఇగ్నో ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ జి.ధర్మారావు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఇ.కృష్ణారావు, సెక్షన్ ఆఫీసర్ వెంకటపతి పాల్గొని ప్రిన్సిపాల్, కళాశాల విద్యార్థినులకు జాతీయ పతాకాలు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇగ్నో స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేఎల్ శిరీష, ఏసీవో ఎస్.అనురాధ, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..



జైల్‌రోడ్డులో విద్యార్థుల తిరంగా ర్యాలీ

బీచ్‌రోడ్డు: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో గురువారం జైల్ రోడ్డు వద్ద విద్యార్థులతో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈస్ట్ జోన్ ఏసీపీ లక్ష్మణ మూర్తి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర సమరయోధుల త్యాగాన్ని నేటి విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకుని దేశభక్తులుగా మారాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విశాఖ జిల్లా కన్వీనర్ ఉమ్మిడి నితిన్, నగర కార్యదర్శి ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జిలు ధనుష్, విష్ణువర్ధన్, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాతృ ప్రేమ వృద్ధాశ్రమం ప్రారంభం



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడలో మమత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నూతనంగా మాతృ ప్రేమ వృద్ధాశ్రమాన్ని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వృద్ధులకు సేవ చేసే భాగ్యం మరువరానిదన్నారు. మమత చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వృద్ధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, వారి అవసరాలకు సహాయం అందించడానికి వచ్చే దాతలకు ప్రాముఖ్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ పృథ్వీరాజ్, ట్రస్ట్ ఫౌండర్ మమత, మెంటల్ కేర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ కెవీ రామిరెడ్డి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ ఆఫీస్ సూపరింటెండెంట్ పద్మావతి, కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.